క్లుప్తంగా

చలివాగు కాల్వగండి పరిశీలన



కాల్వ గండిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారు చలివాగు ప్రాజెక్టు కాల్వకు పడిన గండిని ఏఈ అమృత్ స్థానిక ప్రజాప్రతినిధుల తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ ఫోన్‌లో డీఈ గిరికి సమాచారం అందించి మాట్లాడారు. త్వరలో కాల్వకు మరమ్మతు చేపట్టి గండిని పూడ్చివేస్తామన్నారు. రైతుల పంటలకు నష్టం వాట్లికుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొప్పుల సర్పంచ్ మహేందర్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మధుసూదన్ తదితరులు ఉన్నారు.

దాడి హేయమైన చర్య

వేలేరు : దుబ్బాక బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తితో దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి సోమవారం ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో హత్య రాజకీయాలకు, భౌతిక దాడులకు చోటులేదని, దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కడియం శ్రీహరి

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు కూనూరు రాజు, వార్డు సభ్యుడు ఏరుకొండ సాంబరాజు, చల్లా రాజిరెడ్డి సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు జాలిగపు వనమాల, రొండి రాజు, మాజీ ఎంపీపీలు ఎర్రబెల్లి వెంకటనర్సమ్మ, రాజుగారి రఘు, మాజీ జెడ్పీటీసీ బొడ్డు వాసుదేవ్, బీఆర్‌ఎస్ నాయకులు బొడ్డు ప్రభుదాస్, చాడ నర్సింహారెడ్డి, లాల్‌మహ్మద్, బొడ్డు ప్రదీప్‌కుమార్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి మహిళా మోర్చా అధ్యక్షురాలి రాజీనామా



కమలాపూర్ : బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మాదారపు కవిత బీజేపీకి రాజీనామా చేసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తాను 15ఏళ్లుగా బీజేపీలో పని చేస్తూ ప్రస్తుతం బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా కొనసాగుతున్నానని, తమను ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పట్టించుకోవడం లేదని, మహిళా మోర్చా అధ్యక్షురాలు కూడా ఎవరో తెలియకుండా వ్యవహరించడం బాధాకరమన్నారు. లెఫ్ట్ సిద్ధాంతాలతో వచ్చిన ఈటల రాజేందర్ తన ఒంటెత్తు పోకడలతో బీజేపీలో అన్నీ తానే అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమకు కూడా ఆత్మగౌరవం ఉందని, అందుకే బీజేపీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

సర్వం త్యాగం చేసిన 'ఓంకార్'



వరంగల్ చౌరస్తా: బడుగు జీవుల పక్షాన తన జీవితాన్ని సర్వం త్యాగం చేసి తెలంగాణ అభివృద్ధికి, ప్రజల చైతన్యానికి బీజం వేసిన ఆదర్శజీవి మద్దికాయల ఓంకార్ అని ఎంసీపీఐ (యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎస్ రెడ్డి హంసారెడ్డి తెలిపారు. ఆయన ఆశయ సాధనలో భాగంగా మతోన్మాద బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను తుద ముట్టించాలని పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ఓంకార్ భవన్‌లో ఓంకార్ 15వ వర్ధంతి సభ సోమవారం జరిగింది. అనంతరం మనువాదం – రాజ్యాంగం – ఎన్నికల్లో మన కర్తవ్యం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌రెడ్డి హంసారెడ్డి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓంకార్ సోదరి మొగిలి నిర్మల, నాయకులు నీల రవీందర్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కిషన్, రమేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ధర్మసాగర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



కమలాపూర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున ఏఓ లక్ష్మారెడ్డి

ధర్మసాగర్ : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఐకేపీ అధికారులు అన్నారు. ధర్మసాగర్, సాయిపేట, సోమదేవరపల్లి, ముప్పారం, క్యాతంపల్లిల్లో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. 'ఏ' గ్రేడ్ వరిధాన్యం క్వింటాకు రూ.2,203, కామన్ గ్రేడ్‌కు రూ.2,183 ధర నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఐబీ డీపీఎం అనిల్ కుమార్, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఏఓ పద్మ, ఏపీఎం అనిత, ఏఈఓ రజని, సీసీలు కుడికాల రమ, కవిత, సంపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని గూడూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి జాలి లక్ష్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, కామన్ వరి ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ ఎండీ.చోటేమియా, సంఘ సిబ్బంది సురేష్, సంజీవ్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శ్రద్ధాశుక్లా

దామెర : అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించనున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ పాఠశాలలో ఉపాధ్యాయులకు మొదటివిడత రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రద్ధాశుక్లా మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జగన్ మోహన్ రెడ్డి, జ్యోతివరలక్ష్మీదేవి, ఆర్‌ఐ భాస్కర్ రెడ్డి, ఎంఈఓ రమాదేవి, పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు డి.రాకేశ్‌భాను, దినేష్ చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కాజీపేట: బెల్ట్ షాపులు, మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కాజీపేట పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టరాదని సూచించారు. కాగా, 12కిలోల శుద్ధి చేసిన ఎండు గంజాయితో పాటు పలు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 87126 59020 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదు

● జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి : కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నం ప్రభాకర్‌గౌడ్ కరీంనగర్‌లో రెండు సార్లు ఓటమి పాలై హుస్నాబాద్ నియోజకవర్గానికి వచ్చి ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గ్యారంటీ, వారంటీ కార్డు మాటలను ఎవరు నమ్మరన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, హుస్నాబాద్ గడ్డపై వొడితెల సతీష్‌కుమార్ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. డిసెంబర్ 3 తర్వాత పొన్నం ప్రభాకర్ బిస్తరు కట్టుకొని తిరిగి కరీంనగర్‌కు వెళ్లడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మేకల స్వప్న, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, నాయకులు ఎల్తూరి స్వామి, తంగెడ మహేందర్, పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, శేషగిరి, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌గౌడ్, చిట్టిగౌడ్, బచ్చు ఆనందం తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

● ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

ధర్మసాగర్ : తెలంగాణలో వ్యవసాయాన్ని పండుగ చేసి రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని నర్సింగరావుపల్లి, ఎల్కుర్తి, సాయిపేట గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, బీమా అందిస్తూ రైతులు పండించిన పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఒక వైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల కరెంటు అవసరం లేదు.. 3 గంటలు చాలని అంటున్నారని, మరో వైపు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో 5 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు కావాలా.. 3 గంటల కరెంటు కావాలో రైతులు ఆలోచించాలని తెలిపారు. అనేక పార్టీలు మీ ముందుకు వస్తున్నాయి.. మాయ మాటలు చెప్పి, అరచేతిలో వైకుంఠం చూపిస్తారు, ఎన్నికలప్పుడే వస్తారు.. మళ్లీ కనిపించరు అలాంటి వారిని నమ్మ కూడదన్నారు. అవకాశం ఇస్తే నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేశారు. తాను తప్పు చేయనని, నిజాయితీగా పని చేస్తానని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, డీసీసీబీ డైరెక్టర్ గుర్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బండారు రవీందర్, సర్పంచ్‌లు మాదాసి అరుణ, మామిడి రవీందర్, పెసరు రమేష్, మునిగెల రాజు, రైతు కోఆర్డినేటర్ సోంపెల్లి కరుణాకర్,నాయకులు నర్సింహారెడ్డి, విప్లవ్ కుమార్ రెడ్డి, తోట నాగరాజు, మల్లేశం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు నాయుడు నిర్ణయంతో అన్యాయం'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

పరకాల : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయంతో తనలాంటి నాయకులకు ఎంతో అన్యాయం జరిగిందని టీడీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి తెలిపారు. తెలంగాణలో టీడీపీ పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్న 2014సంవత్సరం నుంచి పార్టీ కోసం నిరంతరం శ్రమించిన ఒక్కసారి కూడ టీడీపీ నుంచి ఎన్నికల బరిలో నిలిచే అవకాశం రాకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శ్రీనివాసాచారి ప్రకటించారు. పరకాల పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గన్నోజు మాట్లాడారు. 2023 ఎన్నికలకు పార్టీ దూరంగా ఉండాలని చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేయడం కార్యకర్తలను, తనను ఎంతో కలవరానికి గురిచేసినట్లు తెలిపారు. టీడీపీకి తనతో పాటు 500 మంది కార్యకర్తలు రాజీనామా చేయడం జరిగిందన్నారు. మూడు, నాలుగు రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మండల అధ్యక్షుడు లక్కం ప్రకాశ్, గంగబోయిన రవీందర్, నడికూడ మండల అధ్యక్షుడు దెయ్యాల చంద్రమౌళి, బందెల శివ, వెంకన్న, మధుకర్, రమణ, సదయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



శాయంపేట : సూర్యాపేట బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బీసీ నేతను తెలంగాణకు సీఎం చేస్తానని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బాణా సంచా పేల్చి సంబురాలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటి వరకు బీసీ ముఖ్యమంత్రి కాలేదని, బీసీలకు రాజ్యాధికారం రావడం ద్వారానే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. భూపాలపల్లిలో కీర్తిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాని కోరారు. కార్యక్రమంలో నాయకులు కానుగుల నాగరాజు, ఉప్పు రాజు, మోత్కూరు సత్యనారాయణ, నరహరిశెట్టి రామకృష్ణ, విజయ్, మంద సురేష్, విద్యాసాగర్, పింగిలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఆత్మకూరు : మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ బయ్య రమ, ఆమె భర్త రాజు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీల అభివృద్ధి జరగాలంటే బీజేపీతోనే సాధ్యమని అన్నారు. బీఆర్‌ఎస్‌లో బీసీలకు సముచిత స్థానం లేదని అన్నారు. ఇప్పటికే ఎంపీపీ సుమలత, జెడ్పీటీసీ రాధిక, నీరుకుళ్ల ఎంపీటీసీ వరుణ్‌గాంధీ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆత్మకూరు ఎంపీటీసీ రమ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ట్రాక్టర్ బోల్తా



నడికూడ : గడ్డి తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని నర్సక్కపల్లి శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం గుండెడు నుంచి పరకాల మండలం నాగారం గ్రామానికి పశువుల మేత కోసం గడ్డిని ట్రాక్టర్ పై తరలిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ ముందు చక్రం విరగడంతో, అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ పై ఉన్న నలుగురికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం పరకాల ఆస్పత్రికి తరలించారు.

నిద్రమత్తులో డ్రైవర్..

● డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

హసన్‌పర్తి: సోమవారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్రమత్తులోకి జారడంతో ఓ లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ సంఘటన హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని చింతగట్టు క్యాంప్ ఎస్సారెస్పీ కార్యాలయం వద్ద జరిగింది. కరీంనగర్ వైపు నుంచి హనుమకొండ వైపునకు లారీ బయల్దేరింది. అయితే, డ్రైవర్ నిద్రమత్తులోకి జారగా డివైడర్‌పైకి లారీ దూసుకెళ్లింది. దీంతో డివైడర్‌లో మధ్యలో చెట్లు ఉండడంతో భారీ ప్రమాదం తప్పింది. లేకుంటే ఎస్సారెస్పీ కార్యాలయం ప్రహరీ పక్కన ఉన్న దుకాణాలు ధ్వంసం అయ్యేవని స్థానికులు తెలిపారు. ఈ సంఘటన వల్ల హనుమకొండ – కరీంనగర్ మధ్యలో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది.

జాతీయ స్థాయి క్రీడాకారులకు సన్మానం



హసన్‌పర్తి: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో జరిగిన కార్యక్రమం ఎమ్మెల్యే అరూరి రమేష్ సోమవారం సన్మానించారు. ఇటీవల బెంగుళూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భీమారంలోని కమల్ నేషనల్ జిమ్‌కు చెందిన మోటం త్రిస్ (బంగారు పతకం), బోడ విశాల్ (కాంస్య పతకం) సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సంగాల కమల్ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరెడ్ల శ్రీధర్, నాయకుడు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి



పరకాల: మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

● వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్
● పరకాలలో పోలీసుల రక్తదాన శిబిరం



అశోక్‌ను అభినందిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

పరకాల : అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు శాంతిభద్రతల కోసం పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకారంగా నిలవాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పుల్లా రవీందర్ కోరారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావడంతోనే యువతకు స్ఫూర్తినిచ్చినట్లు అవుతుందని ఆయన తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని పరకాల పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఓ గార్డెన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీపీ రవీందర్ హాజరై స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొన్న యువకులను, స్వచ్ఛంద సేవ సంస్థల నిర్వాహకులను అభినందించారు. పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, పరకాల, ఆత్మకూరు, శాయంపేట సీఐలు వెంకటరత్నం, రవిరాజ్, మల్లేశ్‌తో పాటు ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం

శాయంపేట : 36 సార్లు రక్తదానం చేసిన అమ్మ అశోక్‌ను ఏసీపీ కిశోర్‌కుమార్ సోమవారం అభినందించారు. పరకాల పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన తెలంగాణ జాగృతి యువత రాష్ట్ర నాయకుడు అశోక్ 36వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



శాయంపేట: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



కరీమాబాద్‌లో బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్సై

శాయంపేట : అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని పరకాల రూరల్ సీఐ మల్లేష్ సూచించారు. మండలంలోని పెద్దకోడెపాకలో పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

పోలింగ్ బూత్ పరిశీలన

ఖిలా వరంగల్: ఎన్నికల నేపథ్యంలో ఏసీపీ బోనాల కిషన్ ఆదేశాలు ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ సూచనల మేరకు వరంగల్ కరీమాబాద్‌లోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌ను మిల్స్‌కాలనీ పోలీసులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ పరిసరాలు, పోలింగ్ బూత్‌కు వెళ్లే దారులను పరిశీలించారు. భద్రతాపరమైన అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ ఆకుల కుమారస్వామి, కానిస్టేబుళ్లు చిరంజీవి, రమేష్, స్కూల్ టీచర్ శారద పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటున్నారని, పని చేసే వారికే పదవులు కట్టబెట్టి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.నాగరాజు, సర్పంచ్ పోతు సుమలతరమణారెడ్డి, ఎలమంచి జయపాల్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్, ఆదిరెడ్డి, జయపాల్‌రెడ్డి, రమేశ్, ఇంద్రయ్య, సమ్మయ్య, రాజయ్య, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చల్లా'ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నడికూడ : పరకాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో సోమవారం బీఆర్‌ఎస్ బూత్ కమిటీల కన్వీనర్, కో కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డిని గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకు వివరించే విధంగా కార్యకర్తలు సమయాత్తం కావాలన్నారు. ఈ సమావేశంలో చందా కుమారస్వామి, నందికొండ గణపతి రెడ్డి, జయపాల్ రెడ్డి, గోల్కొండ సదానందం, మచ్చ రవీందర్, ప్రశాంత్ రెడ్డి, కర్ణాకర్, బొల్లారం అనిల్ కుమార్, పోచంపల్లి రఘుపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'అభ్యర్థి ఎవరైనా.. కలిసే పనిచేస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న
పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, కాళీ ప్రసాద్‌రావు

పరకాల : పరకాల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి టికెట్ ఎవరికి కేటాయించిన ఒక్కతాటిపై ఉండి పనిచేస్తామని ఆ పార్టీ టికెట్ కోసం బరిలో ఉన్న బీజేపీ నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు స్పష్టం చేశారు. సీఎం అభ్యర్థిగా బీసీని ప్రకటించడంపై అధిష్టానం నిర్ణయం చాలా సంతోషదాయకమన్నారు. పరకాల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మేనిఫెస్టోలపై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డి ఆస్తులను పెంచుకోవడం, మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి డబ్బుతో ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలంతా ఏకమై బీజేపీని అధికారంలోకి తీసుకరావడంతో పాటు బీసీ నాయకుడిని ముఖ్యమంత్రి చేయడం ఖాయమన్నారు. బీసీలకు గుణం లేదని మాట్లాడిన మంత్రి కేటీఆర్ బహిరంగంగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మేకల రాజవీర్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, మార్త రాజభద్రయ్య, గాజుల నిరంజన్, విజయ్‌కుమార్, సంఘ పురుషోత్తం, నాగెల్లి రంజిత, పిట్ట వీరస్వామి, మంతెన సంతోష్, నారాయణదాసు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.